
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్

3

జిల్లాల వార్తలు


సోమవారం 13 జనవరి 2025

సంగారెడ్డి హాస్టల్‌గడ్డలోని దర్గాలో జగ్గారెడ్డి

ఉర్సు, ఖవ్వాలి కార్యక్రమాల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



హాస్టల్‌గడ్డ దర్గా ఉర్సులో పాల్గొన్న జగ్గారెడ్డి



మతపెద్దలతో కలిసి ఖవ్వాలి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హాస్టల్‌గడ్డ దర్గాలో ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు, ఖవ్వాలి కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మత పెద్దలను ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు జగ్గారెడ్డిని సన్మానించారు.

పండుగపూట ధరల మోత



సంక్రాంతి పండుగంటేనే వాకిళ్లు రంగురంగుల ముగ్గులతో మురిసి పోతే.. వంటిల్లు ఘుమఘుమలతో ఊరిస్తాయి. అందులోనూ పిండి వంటలు ప్రత్యేకం. వీటి తయారీకి ఉపయోగించే నూనె ధరలు మాత్రం ప్రస్తుతం వంటింట్లో మంటలు రేపుతున్నాయి. ఆ సెగలకు సామాన్యులు విలవిలలాడుతున్నారు. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు దడ పుట్టిస్తున్నాయి. దీంతో పేదలు, మధ్యతరగతి కుటుంబాలు దిక్కులు చూడాల్సి వస్తున్నది. పండుగకు ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని ఆందోళన చెందుతున్నారు.

నూనెలు సలసల

దాదాపు 20 శాతం మేర పెంపు

నింగినంటుతున్న నిత్యావసరాలు

సామాన్య కుటుంబాలు విలవిల

సిద్దిపేట కల్చరల్/మెదక్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. వంట నూనె ధరలు ఆకాశన్నంటుతున్నాయి. రోజురోజుకూ రేట్లు ఎగబాకుతున్నాయి. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మూడు నెలల క్రితం ప్యాకెట్ నూనె ధరకు, ప్రస్తుతానికి రూ.40 వరకు తేడా కనిపిస్తుంది. ఇంతలా ధర పెరగడంతో సామాన్యులు రోజు కూర వండుకోవడానికే సంకోచించుతుంటే, పండగ వేళ మరింత భారంగా మారింది. ఈసారి పండుగకు సకినాలు, మురుకులు, అరిసెలు, గరెజలు, చేగోడీలు ఇలా రకరకాల పిండివంటలు చేసుకునేందుకు జేబులకు చిల్లు తప్పడం లేదు.

మూడు నెలల్లో రెండుసార్లు

మూడు నెలల కాలంలోనే రెండుసార్లు నూనెల ధరలు పెరిగాయి. ఒక్కో రకం ఆయిల్‌ను బట్టి 10 నుంచి 20 శాతం ధరలు పెంచేశారు. మూడునెలల క్రితం ప్యాకెట్ సన్‌ప్లవర్ నూనె కిలో రూ.110కు లభ్యమయ్యేది. పల్లినూనె రూ.120, రైస్‌బ్రాన్ రూ.130 ఉండేవి. ప్రస్తుతం సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.150, పల్లినూనె రూ.185, రైస్‌బ్రాన్ రూ.190-210 వరకు బ్రాండ్లను బట్టి రేట్లు ఉన్నాయి. ఇక పామాయిల్ ధరలయితే గతంలో రూ.95 రూపాయలుంటే ప్రస్తుతం రూ.135 నుంచి 138 వరకు వరకు కంపెనీని బట్టి విక్రయిస్తున్నారు. పిండివంటలకు ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్ కాస్తా సాధారణ నూనెల వరుసలోనే చేరింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగే విజయ బ్రాండు నూనెల రెట్లు మండిపోతున్నాయి.



వంట నూనెల ధరలు (ప్యాకెట్)

నూనెరకం	మూడు నెలల క్రితం	ప్రస్తుతం
పామాయిల్	రూ.95	రూ.138
సన్‌ఫ్లవర్	రూ.110	రూ.150
వేరుశనగ	రూ.120	రూ.185
రైస్‌బ్రాన్	రూ.130	రూ.210

వెల్లుల్లి ఘాటు.. ఉడుకుతున్న పప్పులు

పండుగ పూట ఎక్కువగా అవసరమయ్యే పప్పులు, గోధుమ పిండి,

మిగతా 5వ పేజీలో



సంగారెడ్డిలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి సందడి

- పల్లెలు, పట్టణాలకు పండుగ శోభ
- ఊరూవాడా సంబురాలు
- నేడు భోగి పండుగ

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు, పట్టణాలకు పండుగొచ్చింది. సంబురాలు పూయించే సంక్రాంతి వచ్చింది. వాకిళ్లకు వర్ణకాంతులను, ఇంటిల్లిపాదికి సకల భాగ్యాలను మోసుకొచ్చింది. గంగిరెద్దుల విన్యాసాలు.. ముత్యాల ముగ్గులు.. పతంగుల ఆటలు.. ఇళ్లకు చేరే బంధువులు... అన్నింటికీ మించి రైతన్నకు పంట సిరులతో ఊరువాడా సందడి నెలకొన్నది. ఎక్కడెక్కడి నుంచో చేరిన కుమారులు, కోడళ్లు, బిడ్డలు, అల్లుళ్లు, పిల్లాపాపలతో ఇల్లిల్లూ కళకళలాడుతోంది. ఊరువాడ భోగి, సంక్రాంతి, కనుమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సోమవారం భోగి పండుగను జరుపుకోనున్నారు. దీంతో మార్కెట్లు రద్దీగా మారాయి. రంగులు, గరిక, పేడ, రేగుపండ్లు కొనుగోలు చేస్తున్నారు.

మూడు రోజుల పాటు సంబురం

మూడు రోజుల పాటు సంబురాలు కొనసాగనున్నాయి. ఇప్పటికే ఇళ్లల్లో మహిళలు పిండివంటలు చేస్తూ ఘుమఘుమలాడిస్తున్నారు. మహిళలు వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో నింపి, వాటి మధ్య ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడుతారు. వాటిపై గరక పోసలు ఉంచి. చుట్టూ నవధాన్యాలు, పళ్లు పోస్తారు. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవి తమ ఇళ్లలోకి వస్తుందని నమ్ముతారు. నేడు భోగి పండుగను నిర్వహించనున్నారు. భోగి రోజున తెల్లవారుజామున పిల్లలకు తలస్నానం చేయించి రేగుపండ్లు, చెరకు ముక్కలు, అక్షింతలు కలిసి వారి తలపై పోయడం ద్వారా దృష్టి దోషం తొలగిపోతుందని నమ్ముతారు. పండుగ ముందు నుంచే ఊరువాడ పతంగుల సందడి మొదలైంది. మూడురోజుల పాటు చిన్నాపెద్దా గాలిపటాలను ఎగుర వేస్తూ మరింత ఉత్సాహంగా గడపనున్నారు.



సంగారెడ్డిలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న గాలిపటాల దుకాణం



పతంగులను చూస్తున్న చిన్నారులు

మార్కెట్లు కళకళ

పండుగ వేళ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ముగ్గులు వేసేందుకు మహిళలు రంగులను కొనుగోలు చేస్తున్నారు. రంగులకు గిరాకీ పెరగడంతో మొన్నటివరకు ఒక ప్యాకెట్ ధర రూ.10 ఉండగా ప్రస్తుతం రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. రేగుపండ్లు, గరికపోసలు, మామిడి, పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఆవుపేడను సైతం మార్కెట్లలో విక్రయిస్తున్నారు. గాలిపటాల విషయానికి వస్తే చిన్న సైజు పతంగి గతంలో రూ.5 ఉండగా ప్రస్తుతం రూ.15కి విక్రయిస్తున్నారు. పెద్ద సైజు గాలిపటం ధర మొన్నటివరకు రూ.30 ఉండగా, రూ.60 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నారు. చైనా మాంజాలతో ప్రమాదం పొంచి ఉన్నదని ఆ మాంజాలను విక్రయించకుండా కట్టడి చేసినా విక్రయాలు ఆగడం లేదు. చైనా మాంజాలను విక్రయించిన వారిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. అయినా దొంగచాటున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



ఏడుపాయలలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, వనదుర్గామాత(ఇన్‌సెట్‌లో)

దీవించమ్మా

పాపన్నపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పండుగ సెలవులు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి సత్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.

మెదక్ చర్చిలో ప్రార్థనలు

మెదక్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా, పక్క జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. సంక్రాంతి సెలవులు ఉండటంతో భక్తులతో కిక్కిరిసింది. చర్చి లోపల ఉన్న ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో నిండిపోయింది.



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మతిస్థిమితం లేని మహిళపై
సామూహిక అత్యాచారం

- మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్‌లో ఘటన
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు, కొనసాగుతున్న విచారణ

మాసాయిపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. తన పశువులను ఎవరో అపహరించారంటూ ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రోడ్డుపై ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తుండగా మహిళపై అత్యాచార ఘటన దృశ్యాలు కనిపించాయి. ఘటన ఈ నెల 8న తెల్లవారుజామున జరిగిందని గుర్తించారు. ముగ్గురు నిందితులను గుర్తించిన చేగుంట పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యాధికారులకు సూచించారు. ఆయన ఆదివారం మెదక్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖకు సంబంధించిన అన్ని అంశాలలో పురోగతి సాధించాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ,



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రభుత్వ పాఠశాలలో సంవత్సరం నుంచి 15 సంవత్సరాలలోపు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.



గంగిరెద్దు, సన్నాయి గాత్రంతో కళాకారుడు

రుణయాప్‌లలో అప్పు చేసి..
ఆన్‌లైన్‌లో బెట్టింగులు

● రూ. 10 లక్షల బాకీ తీర్చలేక హైదరాబాద్‌లో యువకుడి ఆత్మహత్య

రామాయంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రుణయాప్‌లలో అప్పు చేసి ఆన్‌లైన్ బెట్టింగుల్లో పెట్టి పోగొట్టుకున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రశాంత్(24) కుటుంబం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో స్థిరపడింది. తూంకుంట వద్ద ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ప్రశాంత్ రుణయాప్‌ల నుంచి రూ.10 లక్షల వరకు అప్పులు చేసి ఆన్‌లైన్ బెట్టింగుల్లో పెట్టి పోగొట్టుకున్నాడు. దీంతో అప్పు తీర్చాలంటూ రుణయాప్ నిర్వాహకులు వేధించసాగారు. అప్పు తీర్చే మార్గం కనిపించక శనివారం అర్ధరాత్రి తూంకుంట శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని ప్రశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండపోచమ్మసాగర్ వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలించిన వీహెచ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరావు

మర్కుక్, ములుగు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపో చమ్మసాగర్ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు ఐదుగురు మునిగి చనిపో వడంపై కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విచారం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు.

మోతీమాత జాతర ప్రారంభం


అమ్మవారి సన్నిధికి తరలివస్తున్న గిరిజన మహిళలు

జహీరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లితండా శివారులోగల మోతీమాత ఆలయంలో జాతర వైభ వంగా ప్రారంభమైంది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కిషన్‌రావ్ పవార్, అసోసియేట్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేమసింగ్‌రాథోడ్, ఉపాధ్యక్షుడు నారాయణజాదవ్, ప్రధాన కార్యదర్శి పవ న్‌రాథోడ్, టీబీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాంరాథోడ్, నాయకులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం


గొల్లపల్లిలో మల్లికార్జునస్వామి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం గొల్లపల్లి లోని కేతకీ మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాధామల్లేశ్‌గౌడ్ పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహించగా ఇందులో భాగంగా స్వామివారిని వేదపండితులు హరిప్రసాద్‌శర్మ నేతృత్వంలో అలంకరించి పూజలు నిర్వహించారు.

మెడికల్ కాలేజీ నియామకాల్లో నిబంధనలు పాటించాలి


సంగారెడ్డి ఆస్పత్రి ప్రాంగణంలో కార్మికులతో మాట్లాడుతున్న మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ కింద చేపడుతున్న నియామకాల్లో నిబంధనలు పాటించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం కార్మికులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలివ్వడం దారుణమన్నారు. ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచే స్తున్న కార్మికులను కాదని ఇతరులకు ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నియామ కాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు సదా నందం, మహేందర్, నాగరాజు, సునీత, లక్ష్మణ్, శ్రీనివాస్, నాగార్జున, భాగ్యలక్ష్మి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రింగు రోడ్డు పనుల పరిశీలన

నారాయణఖేడ్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూరా బిట్లు బిట్లుగా నిర్మిస్తున్న రింగు రోడ్డు పనులను ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహాన్, మాజిద్, నర్సింలు, మూఢ రామక్రిష్ణ, హన్మాండ్లు పరిశీలించారు. 161 బీ జాతీయ రహదారిలోని మనూరు క్రాస్ రోడ్డు నుంచి ఖేడ్- కంగ్టి రోడ్డు వరకు ఒక పార్ట్‌గా, అక్కడి నుంచి చాంద్‌ఖాన్‌పల్లి వరకు అలాగే వెంకటే శ్వర స్వామి ఆలయం, డీఎస్పీ కార్యాలయం సమీపంలోని 161 బీ జాతీయ రహదారిని కలుపుతూ బిట్లు బిట్లుగా రోడ్డును నిర్మిస్తున్నారు. రోడ్డుతో పాటు నిర్మించనున్న ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ రోడ్డువల్ల ఖేడ్‌లో ట్రాఫిక్ సమస్యలు తీరడంతో పాటు పలు మండలాల వారికి దూరభారం తగ్గుతుందని, భూములకు రోడ్డు సదుపాయం ఏర్పడమే కాకుండా, రైతులకు మేలు చేకూరుతుందని వారు వివరించారు.

బసవన్నా.. విన్యాసాలేవన్నా..

- ● ఆదరణ లేక కనుమరుగు
- ● పట్నాల్లో అక్కడక్కడా దర్శనం
- ● ఉపాధి లేక ఇతర వృత్తుల్లోకి



దూ దూ బసవన్నా.. ఇటు రారా బసవన్నా.. అమ్మవారికి దండం పెట్టు.. అయ్యాగారికి దండం పెట్టు.. మన సుబ్బు గారికి దండం పెట్టు.. అంటూ గంగిరెద్దుల కులస్థులు ఊరూరా చేసే సందడి కనుమరుగవుతున్నది. నేడు ఆదరణ కరువవడంతో వారు ఈ వృత్తిని వీడి ఇతర పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

హుస్నాబాద్/చిన్నశంకరంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు ప్రత్యేకంగా గుర్తుకు వచ్చేది గంగిరెద్దుల విన్యాసాలే. గంగిరెద్దుల కులస్థులు ఊరూరా తిరుగుతూ బసవన్నలతో ఆటలాడిస్తూ సందడి చేస్తుంటారు. నేటి ఆధునిక యుగంలో ఈ సంప్రదాయాలు కనుమరుగవతున్నాయి. రానురాను దీనికి ఆదరణ కరువవడంతో ఆ కులస్థులు వారి వృత్తిని వదిలి ఇతర వృత్తుల వైపు మారుతుండటంతో క్రమేపి పల్లెల్లో ఈ సందడి తగ్గుముఖం పట్టింది. అదే కాకుండా సంక్రాంతి పండుగకు పది రోజుల ముందే గంగిరెద్దుల వారు పల్లెలకు రాకుండా పట్నం బాట పడుతున్నారు. అక్కడ గంగిరెద్దులకు మంచి ఆదరణ లభించడమే ఇందుకు కారణం.

హుస్నాబాద్‌లో ఎక్కువ మంది

ఎప్పుడూ సంచారజీవితం గడిపే గంగిరెద్దులవాళ్ల హుస్నాబాద్ ప్రాంతంలోనే ఎక్కువగా స్థిరపడ్డారు. నంగునూర్, ముండ్రాయి, గట్లమల్యాల, ఆకునూర్, హుస్నాబాద్, ఆరపల్లి, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్, బొమ్మనపల్లి, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు, కందుగుల, ఇందిరానగర్ గ్రామాల్లో ఉన్నారు. వీరికి సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు చేతినిండా డబ్బులు, ధాన్యం, పిండి వంటలు వంటివి లభిస్తాయి. అయితే వీరు జూన్ నెల నుంచి సెప్టెంబర్ మాసం వరకు 4 నెలల పాటు ఇంటి పట్టున ఉంటారు. సెప్టెంబర్ నుంచి మే నెల వరకు 8 నెలలు సంచార జీవితాన్ని గడుపుతారు. ప్రస్తుతం వీరు కూడా వ్యవసాయం, ఇతర పనులు చేస్తుండటంతో ముఖ్యమైన పండగ దినాల్లోనే పట్నాల బాట పడుతున్నారు. అంతగా గిట్టుబాటు లేకపోవడంతో ఈ రోజుల్లో గంగిరెద్దుల కులస్థులు ఇతర వృత్తుల్లోకి వెళ్తున్నారు. పూటగడవడం కోసం గంగిరెద్దుల కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ పని చేస్తుంటారు. మగవాళ్ల గంగిరెద్దులను ఆడిస్తుంటే మహిళలు మాత్రం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి చేదోవాదోడుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

పల్లెల్లో ఆదరణ లేకనే పట్నాలకు



పల్లెల్లో మునుపటి లెక్క ఆదరణ లేకనే పది పైసలు దొరుకుతాయని మా వాళ్లు పట్నాలకు పోతున్నారు. అప్పట్లో సంక్రాంతికి కల్లాల వద్దకు పోతే వడ్లు, జొన్నలు పెట్టెవారు. ఇప్పుడు అదీ లేదు. ఇప్పుడు మా వాళ్లు చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్నరు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి పైగా ఉన్నం. ఇప్పుడు బీసీ-ఏ లో ఉన్నం. ఎస్టీలో చేర్చాలని కోరుతున్నం. సర్కార్ మా గురించి పట్టించుకోవాలే.

-గంట సమ్మయ్య, గంగిరెద్దుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి



పండుగపూట.. ధరల మోత

(3వ పేజీ తరువాయి)



పల్లీలు, బెల్లం, నువ్వులు వంటి నిత్యావసర సరుకుల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. కూరగాయాల రేట్లు అటు ఇటుగా అందుబాటులో ఉన్నా వెల్లులి మాత్రం ఘాటెక్కిస్తుంది. ప్రస్తుతం కిలో రూ.400 వరకు పలుకుతున్నది. వెల్లుల్లి అధికంగా పండించే ఉత్తర భారతం నుంచి దిగుమతులు తగ్గిపోవడమే ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అల్లం రూ.120, కందిపప్పు రూ.180 వరకు విక్రయిస్తున్నారు. ఆరు నెలల క్రితం కిలో రూ.130కి లభ్యమయ్యే నువ్వులు ప్రస్తుతం రూ.250 లకు ఎగబాకడం అందోళన కలిగిస్తోంది. పండుగకు అరిసెలు, గర్జెలు, పల్లీల ఉండలు, పేలాల ఉండలు, ఇలా బెల్లంతో పలు వంటకాలు చేస్తారు. ప్రస్తుతం బెల్లం ధరలు కూడా పెరిగాయి. మూడు నెలల క్రితం కిలో రూ.60 ఉండగా.. ప్రస్తుతం రూ.80కు చేరింది. నిత్యం వినియోగించే బియ్యం ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సన్నాల ధరలు మరీ అధికంగా ఉన్నాయి. జయశ్రీ సూపర్ ఫైన్ రైస్ క్వింటా రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. హెచ్‌ఎంటీ బియ్యం రూ.6 వేలు పలుకుతున్నది. ఏది కొనాలన్నా.. ఏది తినాలన్న ఒకటి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుందంటున్నారు సామాన్యులు.

రేట్లు చెబితే అవాక్కవుతున్నారు

హోల్‌సేల్ మార్కెట్‌ను బట్టి, మేం రిటైల్ అమ్మకాలు చేస్తాం. పెరిగిన రేట్లను వినియోగదారులకు చెబితే అవాక్కవుతున్నారు. లాస్ట్ టైమ్ తీసుకున్నప్పుడు తక్కువ ఉంది కదా. ఇప్పుడు ఇంతా రేట్ పెరిగిందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ ధరల నియంత్రణ మా చేతుల్లో లేదు కదా. గతంతో పోలిస్తే విక్రయాలు కూడా తగ్గాయి.

- అంజనేయులు, కిరాణషాపు యజమాని, సిద్దిపేట

ఆదాయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

నెలసరి వచ్చే ఆదాయం తక్కువగా ఉంటుంది. కానీ ఖర్చులు చూస్తే మాత్రం ఎక్కువ అవుతున్నాయి. పండుగలు వస్తే అది మరో అదనపు ఖర్చుగానే అనిపిస్తోంది. పండుగ సంబురం మాట పక్కన బెడితే పండుగ సామాను తీసుకరావాలని మార్కెట్‌కు వెళ్లాలంటే భయంగా ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారిన కూడా సామాన్య ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకుల ధరలు మాత్రం తగ్గించటం లేదు.

- దీక్షిత, గృహిణి, సిద్దిపేట





పొట్లపల్లిలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన చలువ పందిర్లు, కొలువుదీరిన రాగుల మల్లికార్జునస్వామి

నేటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని స్వయంభూ పార్వతీ భ్రమరాంబ సమేతా రాగుల మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. 13న గణపతిపూజ, సహస్రనామార్చన, రుద్రాభిషేకం, శివకల్యాణం, కుంకుమార్చన, 14న అభిషేకం, దిప్షికుంభం, వీరభద్రస్వామి, భద్రకాళి పూజ, సాయంత్రం ఎడ్ల బండ్ల తిరుగుట, బోనాలు, పట్నం, అగ్నిప్రతిష్ఠ, 15న అగ్నిగుండాల ప్రవేశం, గోపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకుడు మహేశ్వర్ తెలిపారు.

రేపటి నుంచి బండమల్లన్న జాతర



మిరుదొడ్డి : బండపై వెలిసిన రాజరాజేశ్వరస్వామి

మిరుదొడ్డి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల మధ్య ఉన్న బండ మల్లన్న జాతర రేపటి నుంచి షురూ కానున్నది. సంక్రాంతిని పండుగను పురస్కరించుకుని మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. 109 ఎకరాల్లో మల్లన్న స్వామితో పాటు పాండవులవిగ్రహాలు, రాజరాజేశ్వర, వేంకటేశ్వర, పోషమ్మ, ఆంజనేయస్వామి, నాగదేవతల ఆలయాలు ఉన్నాయి. వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్, గాజులపల్లి, మల్లుపల్లి, దోమ్మాట, చెప్యాల గ్రామాలకు చెందిన 80 ఎడ్ల బండ్లను బండ మల్లన్న చుట్టూ ఊరేగిస్తారు.

ఉత్సవాలకు అనాజీపూర్ ముస్తాబు



రాతిగుండుపై వెలసిన బయ్యన్న

రాయపోల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక ఉత్సవాలకు రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామం ముస్తాబైంది. మంతూరుకు వెళ్లే రహదారిపై ఉన్న బయ్యన్న గుండ్ల వద్ద బయ్యన్నస్వామి ఆలయంతోపాటు పురాతన బద్దిపోచమ్మ, అంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇటీవల రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని కూడా నిర్మించారు. ఇక్కడ సోమవారం గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు పురోహితుడు నారాయణస్వామి తెలిపారు. అలాగే మంగళవారం ఎడ్ల బండ్ల ఊరేగింపు, ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు, బుధవారం గ్రామ సమీపంలోని దుర్గామాత ఆలయం వద్ద జాతర, రాత్రి బోనాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

లీఫ్ ఆర్టిస్టుకు నటుడు సోనూసూద్ అభినందన



నారాయణఖేడ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ కళను మెచ్చుకుంటూ హిందీ చలనచిత్ర నటుడు సోనూసూద్ అభినందించారు. ఆదివారం సోనూసూద్ కర్ణాటకలోని బీదర్‌లో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని తిరిగి ముంబయికి వెళ్తూ.. న్యాల్‌కల్ మండలం గంగ్వార్ చౌరస్తా వద్ద వాహనం ఆపి అభిమానులతో కొంతసేపు మాట్లాడారు. అక్కడ శివకుమార్ రావి ఆకుపై సోనూసూద్ చిత్రాన్ని జ్ఞాపికగా ఫ్రేమ్ కట్టించి అందజేశారు. రావి ఆకుపై చిత్రాన్ని మలిచే కళలో రాణిస్తున్నందుకు అభినందించారు.

కోహీర్‌లో ఇళ్ల సర్వే పూర్తి

కోహీర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 100 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. మండలంలోని 24 పంచాయతీల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం 13,978 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న ప్రతిఒక్కరి ఇంటి వద్దకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి ఫొటో క్యాప్చర్, ఆధార్, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేశామన్నారు. ఆదివారం నాటికి 100 శాతం సర్వే పూర్తయిందని చెప్పారు.

దొంగల హల్‌చల్

- ● కవలంపేటలో రూ.2.6 లక్షలు, బంగారం చోరీ
- ● న్యాల్‌కల్ వైన్స్‌లో నగదు, మద్యం బాటిళ్ల తస్కరణ

కంది, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కవలంపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన ఎండీ ఆశం హైదరాబాద్‌లోని తన బంధువుల పెళ్లికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు తాళాలు విరగ్గొట్టి బీరువాలోని రూ.లక్షన్నర నగదుతో పాటు తులంన్నర బంగారు ఉంగరాలను దోచుకెళ్లారు. అదే ఇంట్లోని కిరాణా దుకాణంలో రూ.10వేలు విలువ చేసే సబ్బులు, టూత్‌పేస్టులు, కొన్ని వస్తువులు పట్టుకుపోయారు. అలాగే గ్రామంలోని బ్యాగరి మల్లేశం శనివారం బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా ఇనుపపెట్టెలో తన కూతురికి వైద్య ఖర్చులకోసం దాచుకున్న రూ.లక్ష కనిపించలేదు. దుండగులు ఆ పెట్టెను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు. కాగా, కవలంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ నుంచి ఏర్పాటు చేసిన దాదాపు 20 సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



కవలంపేటలో ఖాళీ ఇనుప పెట్టెను చూపిస్తున్న బాధితుడు

ప్రభుత్వ కార్యాలయాలు, వైన్స్‌లో..

న్యాల్‌కల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన న్యాల్‌కల్ దోపిడి దొంగలు బీభత్సం సృష్టించారు. వివరాల్లోకి వెళ్లితే శనివారం రాత్రి దుండగులు ఎంపీడీవో, తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాల తాళాలను పగులగొట్టి ప్రవేవేశించి బీరువాలను పగులగొట్టారు. అందులో ఏమి దొరకకపోవడంతో ఫైళ్లను చిందరవందరగా పడవేసి వెళ్లిపోయారు. అనంతరం సిద్ధి వినాయక వైన్స్‌లో దొంగతనానికి పాల్పడి క్యాష్ కౌంటర్‌లోని రూ.20వేల నగదు, మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆయా ప్రాంతాల్లో సీసీఫుటేజీలను పరిశీలించగా చోరీ దృశ్యాలు కనిపించాయి. దీన్ని ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



న్యాల్‌కల్‌లోని వైన్స్‌లో సీసీ కమెరాల్లో చిక్కిన చోరీ దృశ్యాలు

ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలకు వలస వచ్చిన ప్రజలు సంక్రాంతికి సొంతూళ్ల బాట పట్టారు. ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సమేతంగా ఊరెళ్తున్నారు. ఇదే అదునుగా భావించి దొంగలు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

సంక్రాంతి పండగకు వెళ్లే వారంతా ఇరుగుపొరుగు వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఖరీదైన వస్తువులను వెంట తీసుకెళ్లడమే ఉత్తతమని, లేదంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని చెబుతున్నారు. కాలనీలవారీగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలని, ఇంటికి తాళం వేసినప్పటికీ ఇంట్లో మనుషులు ఉన్నట్టుగా పరిసరాలను ఉంచుకోవాలంటున్నారు. అందుకోసం ఆరుబయట బట్టలు ఆరవేయడం, డోర్ ఎదుట చెప్పులు ఉంచడం, తాళం కనిపించకుండా కర్టెన్లు వేయాలని సూచిస్తున్నారు. అలాగే సమీప పోలీస్‌స్టేషన్‌లలో సమాచారం అందివ్వాలని, ఇరుగుపొరుగువారి ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలని చెబుతున్నారు. ఊళ్లకు వెళ్తున్న సమయాల్లో సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టవద్దని సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య

● వివాహేతర సంబంధాలే కారణం!



శ్రీనివాస్ (ఫైల్)

జోగిపేట, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు దారుణంగా హత్యకు గురైన ఘటన మండలంలోని తాలెల్మ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ అనిల్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల శ్రీనివాస్(30)ను గుర్తుతెలియని దుండగులు గొంతుకోసి, ఆపై బండరాతితో తలపై మోది దారుణంగా హత్య చేశారు. శనివారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిన శ్రీనివాస్, సాయంత్రం వరకూ ఇంటికి రాలేదు. దీంతో అతడి తండ్రి మల్లేశం శనివారం రాత్రి జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం తాలెల్మ గ్రామ శివారులోని చెక్‌డ్యాం వద్ద ఓ మృతదేహం కనిపించిందంటూ కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అనిల్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కర్రోళ్ల మల్లేశంను పిలిపించి మృతదేహాన్ని చూపింగా తన కొడుకుదేనని నిర్ధారించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వివాహేతర సంబంధాలే ఈ హత్యకు కారణమని తెలిసింది.

పాత కక్షలతో డ్రైవర్..



షేక్ సమీర్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో ఓ డ్రైవర్ దారుణ హత్యకు గురైన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన షేక్ సమీర్ అలియాస్ అమూల్(27) బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం సంగారెడ్డి పట్టణానికి వచ్చి శాంతినగర్‌లో భార్యాపిల్లలతో నివాసముంటున్నాడు. సమీర్ పగటి పూట డ్రైవర్‌గా పనిచేస్తూ, రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సంగారెడ్డి, సదాశివపేట, పటాన్‌చెరు, శంకర్‌పల్లి ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన అనీస్ అనే వ్యక్తిని సమీర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఇరికించాడు. తనకు ఎలాంటి సంబంధం లేకుండా సమీర్ తనను దొంగతనం కేసులో ఇరికించాడనని అనీస్ కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న అర్ధరాత్రి సంగారెడ్డి పట్టణంలోని సితార థియేటర్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ ఖాళీ స్థలానికి సమీర్, అనీస్‌లు వెళ్లారు. అప్పటికే కోపంతో ఉన్న అనీస్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సమీర్ గొంతు, మెడపై దాడి చేసి దారుణంగా హతమర్చాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి సీఐ రమేష్ తదితరులు చేరుకుని దర్యాప్తు జరిపారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

చెరువులో దూకిన వ్యక్తి గల్లంతు



శ్రీకాంత్ (ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి అమీన్‌పూర్ పెద్దచెరువులో దూకగా గల్లంతైన సంఘటన అమీన్‌పూర్‌లో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పట్టణంలో నివాసం ఉండే శ్రీకాంత్ (38) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్యతో తరచూ గొడవలు జరగుతున్నాయి.డబ్బులు కావాలంటూ శనివారం అర్ధరాత్రి కూడా భార్యతో గొడవ పడి ఇంట్లోని సోఫాలను దగ్ధం చేశాడు. దీంతో ఆమె 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇంటి వద్దకు వచ్చి శ్రీకాంత్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లారు. కాసేపటికి శ్రీకాంత్ ఇంటి ఎదురుగా ఉన్న పెద్దచెరువులో దూకాడు. సమాచారం అందుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, గజ ఈతగాళ్ల చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా శ్రీకాంత్ ఆచూకీ లభించలేదు. గతంలో కూడా భార్యతో గొడవ పడిన శ్రీకాంత్ చెరువులో దూకండంతో గ్రామస్థులు రక్షించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ పోలీసులు తెలిపారు.

రూ.24 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వ్యక్తి రూ.24లక్షలు పోగొట్టుకున్నాడు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన కె.దుగ్గిరెడ్డికి ఫోన్ యాప్‌లో గుర్తు తెలలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఓ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపాడు. దీంతో దుగ్గిరెడ్డి మొదట రూ.3లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశాడు. తర్వాత విడతల వారీగా మొత్తం రూ.24లక్షలు చెల్లించాడు. తన డబ్బుతో పాటు లాభం కూడా ఇవ్వాలని దుగ్గిరెడ్డి పలుమార్లు సదరు వ్యక్తికి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు తెలుసుకొని సంగారెడ్డి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం గుడితండాలో వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ చోరీ చేసినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. గుడి తండాలో ట్రాన్స్‌ఫార్మర్ పని చేయడం లేదని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు ట్రాన్స్‌ఫార్మర్‌ను తనిఖీ చేయగా ఆయిల్ చోరీ అయినట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హైనా దాడిలో 30 గొర్రెల మృతి



పంచనామా చేస్తున్న ఫారెస్ట్ అధికారి

మద్దూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం ధర్మారం, మర్మాముల గ్రామాలలో హైనా దాడిలో గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధితులు గుడిసె కొమురయ్య, చెట్కూరి ఇస్తారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిన్న రాత్రి హైనా దాడి చేయడంతో ధర్మారంలో 12 గొర్రెలు, మర్మాములలో 18గొర్రెలు చనిపోయినట్లు తెలిపారు. ఈ విషయమై ఫారెస్ట్ ఆఫీసర్ అధికారికి ఫోన్ చేయగా, సంఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా జరిపారు.

వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలి

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో స్వామివివేకానంద 162వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటిన స్వామివివేకానంద సిద్ధాంతాలను యువత శిరోధార్యంగా భావించాలని సూచించారు. తన రచనలు, సందేశాల ద్వారా ఆదర్శమూర్తిగా నిలిచారన్నారు. యువత వివేకానందను స్ఫూరిగా తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



పటాన్‌చెరులో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి ఐబీలోని వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్



నారాయణఖేడ్‌లో స్వామివివేకానంద విగ్రహానికి పూలమావేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేపట్లోళ్ల సంజీవరెడ్డి



మెదక్ అర్బన్ : కలెక్టరేట్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మనోహరాబాద్ : కాళ్లకల్ గ్రామంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలవేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



పెద్దశంకరంపేటలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

న్యూస్ బాక్స్

జాతరతో ఆహ్లాదకర వాతావరణం

పటాన్‌చెరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాతరతో ఆహ్లాదకర వాతావరణం చోటు చేసుకుంటుందని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు మండలం భానూరు గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ జాతరలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదాకర్‌గౌడ్, శ్రీశైలం, పాటి గోపాల్‌యాదవ్, శివానందం తదితరులు పాల్గొన్నారు.

14న అయ్యప్పస్వామి అంబారి శోభాయాత్ర

సంగారెడ్డి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మకర సంక్రాంతిని పురస్కరించుకుని 14న ఉదయం 11 గంటలకు సంగారెడ్డిలో అయ్యప్పస్వామి స్వర్ణాభరణాలు అంబారి (ఏనుగు)పై శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు మణికంఠ అయ్యప్ప ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సాహితీ రాముగురుస్వామి తెలిపారు. సంగారెడ్డిలోని నవరత్నాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

'ఈఎస్ఐని కార్పొరేట్ ఆస్పత్రిగా మార్చాలి'

రామచంద్రాపురం టౌన్ 12 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తున్న రామచంద్రాపురం ఈఎస్ఐని కార్పొరేట్ ఆస్పత్రిగా మార్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య అన్నారు. భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో సీపీఎం 4వ మహాసభలకు సంబంధించి విరాళాలు సేకరించారు.

శ్రీనివాస్‌గౌడ్ మరణం తీరనిలోటు

చేగుంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నార్సింగి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అకాల మరణం పార్టీకి తీరనిలోటని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో శ్రీనివాస్‌గౌడ్ అంతిమయాత్రలో పాల్గొని పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

మనోహరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్ ఖండించారు. ఆదివారం మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

నేచర్ ఐకాన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

మనోహరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించారు. ఇందులో గెలుపొందిన యువతులకు గ్రామానికి చెందిన కిరణ్‌యాదవ్ సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు.

రెండోరోజూ దీక్షలు

నిజాంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు కోసం నాలుగు గ్రామాల ప్రజలు తలపెట్టిన నిరసన దీక్షలు రెండోరోజుకు చేరాయి. నిజాంపేట-నస్కల్ రహదారి నరకప్రాయమైందంటూ ఉద్యమం ప్రారంభించారు. బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ దీక్షకు సంఘీభావం ప్రకటించారు.

రామకృష్ణకు సేవ్ గ్లోబల్ ఫార్మెట్స్ అవార్డు

జిన్నారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాళ్లకత్వకు చెందిన యువజన సంఘాల నాయకుడు ఆది రామకృష్ణకు సేవ్ గ్లోబల్ ఫార్మెట్స్ అవార్డును ఎమ్మెల్సీ కోదండరామ్ చేతులమీదుగా అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ అవార్డులు పంపిణీ చేశారు.

పండ్ల పంపిణీ

నర్సాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరుణ్ జన్మదినం సందర్భంగా నర్సాపూర్‌లోని దంగోరియా వృద్ధాశ్రమంలో నాయకులు పండ్లు పంపిణీ చేశారు.

'పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి'

బెజ్జంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తానని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజాంబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్‌ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఉమ్మడి బెజ్జంకి, గన్నేరువరం మండలాలకు చెందిన పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నుంచి యువతకు దక్కాల్సిన హక్కులు, ఉపాధి ఉద్యోగ అవకాశాలు అమలయ్యేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి: ఎంపీ



ఆధ్యాత్మిక మహాసభలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్, పక్కన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. ఖేడ్ మండలం జుజాల్‌పూర్‌లోని ఇదారా ఇష్టాదుల్ ఉలుమ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక మహాసభకు హాజరై మాట్లాడారు. ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న మదర్సా 20 ఏళ్ల పూర్తి చేసుకున్నదన్నారు. హాఫేజే ఖురాన్ పూర్తి చేసుకున్న 21 మంది విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, హన్మండ్లు, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఖేడ్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహాల ఆవరణల్లో ఆదివారం ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, కాంగ్రెస్ అధ్యక్షురాలు అవుసుల భవానీ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓంశాంతి క్యాలెండర్లు ఆవిష్కరణ

నారాయణఖేడ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓంశాంతి ట్రస్టుకు సంబంధించిన 2025 క్యాలెండర్లను జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ ఖేడ్‌లోని తన గృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివ్‌రావుషెట్కార్ 29వ వర్థంతి సభ

స్వాతంత్ర్య సమరయోధుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే శివ్‌రావు షెట్కార్ 29వ వర్ధంతి సందర్భంగా సర్వధర్మ సమ్మేళనాన్ని ఖేడ్ శివారులోని ఆయన సమాధి వద్ద నిర్వహించనున్నట్లు తనయులు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్, జితేందర్‌నాథ్ షెట్కార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరు కావాలన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



భిఖ్యాతండాలో లబ్ధిదారుడికీ సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న రాజిరెడ్డి, ఆంజనేయులు

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా కడ్పల్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌కు రూ.60 వేలు, గైని లక్ష్మయ్యకు రూ.60 వేలు, ప్రవీణ్‌కు రూ.23 వేలు, సాయిలుకు రూ.25 వేలు, అలాగే పెద్దశంకరంపేట మండలానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, ఖేడ్ గురుకుల ప్రిన్సిపల్ లింగారెడ్డి, ఖేడ్, నల్లవాగు గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ గణితం విభాగంలో నిజాంపేట మండలం ర్యాలమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినయ్‌కుమార్ ప్రథమ బహుమతి సాధించి జాతీయస్థాయికి ఎంపికైనందున ఆయనను ఎమ్మెల్యే సంజీవరెడ్డి శాలువాలతో సన్మానించి అభినందించారు. కాగా బాచేపల్లిలోని రాధాస్వామి సత్సంగ్‌లో 19న నిర్వహించనున్న ఉచిత ధ్యాన శిబిరానికి హాజరుకావాలని కోరుతూ బాధ్యులు ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

శివ్వంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సుమారు 17 గ్రామాల్లోని 29 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.19.50 లక్షల చెక్కును నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ చట్టం తీసుకురావడంపై హర్షం

సంగారెడ్డి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ చట్టం 2024 తీసుకురావడం పట్ల పూర్వ వీఆర్‌వోలు హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంతోష్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎన్.సత్యనారాయణ, సంతోష్‌కుమార్, వెంకటయ్య, మల్లేశం, సంతోష్ పాల్గొన్నారు.

'పీజేఆర్ సేవలు మరువలేనివి'

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పారిశ్రామికవాడ ప్రాంతంలో కార్మికులకు, పేదలకు స్వర్గీయ పీజేఆర్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం ఆయన జయంతి పురస్కరించుకుని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శ శ్యాంరావు, నాయకులు పాల్గొన్నారు. అలాగే పీజేఆర్ జయంతి సందర్భంగా చిట్కుల్‌లోని జీటీఎన్ టెక్స్‌టైల్స్ ఆవరణలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ పరిశ్రమ కార్మికులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు.

స్వామి వివేకానంద జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శం

గుమ్మడిదల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆవరణలో సీజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్టు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, పుట్ట నర్సింగ్‌రావు, సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే గుమ్మడిదలలో సీజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండురోజులుగా జరుగుతున్న ఓపెన్ టూ ఆల్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి 'తారా' విద్యార్థులు



నరేశ్, దీక్షిత

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యతా శిబిరానికి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో కర్ణాటక ప్రభుత్వ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిబిరానికి కళాశాలలోని బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థి నరేశ్, బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని దీక్షిత ఎంపికయ్యారు. 14 నుంచి 21వ తేదీవరకు కర్ణాటకలోని గుల్బార్గా యూనివర్సిటీ కాలబురిగిలో జరిగే శిబిరంలో వీరు పాల్గొననున్నారు. జాతీయ సమైక్యతా శిబిరానికి ఇద్దరు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, నిర్మల, అధ్యాపకులు అభినందించారు.

ఇదేనా ఇందిరమ్మ పాలన?: బీఆర్ఎస్

చేర్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యస్థాపన చేపడుతున్నామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రౌడీ రాజ్యమేలుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాలనర్సయ్య, జిల్లా నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాలలో పార్టీ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడులను తీవ్రంగాఖండిస్తున్నామన్నారు.

కేజీకేఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేజీకేఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) అధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఆదివారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజుగౌడ్, మాజీ జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో రంగోలీ, గాలిపటాల పండుగ



రంగోలీ, గాలిపటాల పండుగలో ఐఎంఏ డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)సంగారెడ్డి ఆధ్వర్యంలో రంగోలీ, గాలిపటాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారులోని ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో 'డాక్టర్ల మధ్య ఐక్యత-సంప్రదాయ సంస్కృతి' అనే థీమ్‌తో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డా.రంగారెడ్డి హాజరై తమ ప్రేరణాత్మక మాటలతో ఉత్తేజపరిచారు. అనంతరం రంగోలీ, గాలిపటాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా.కిరణ్‌కుమార్, కార్యదర్శి డా.ఆనంద్, కోశాధికారి డా.హరినాథ్‌రెడ్డి, నిర్వహణ కార్యదర్శి డా.సురేశ్‌కుమార్, వైద్యులు డా.శ్రీధర్, డా.పరుషురాం, డా.గాయత్రి, డా.లలిత పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● మండల అధ్యక్షుడు ప్రతాప్ రమేష్‌జ్యోషి



సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్న ప్రతాప్ రమేష్‌జ్యోషి, నాయకులు

వట్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతాప్ రమేష్‌జ్యోషి అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో 35 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌పాటిల్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, సభ్యులు దిగంబర్ రావు, నాగయ్య, పెద్దన్న, మోహిన్ పాల్గొన్నారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

ఝరాసంగం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎస్ఐ నరేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఝరాసంగంలో కంబాలపల్లి హనుమన్న పాటిల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేషం, నాయకులు జగదీశ్వర్, విజయ్‌పాటిల్, రమేష్ పాటిల్, మాణిక్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

●నాగల్‌గిద్ద: మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కరసగుత్తిలో పీకేఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండేరావుపాటిల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సచిన్‌పాటిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తునికి నల్లపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



తునికి నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కౌడిపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తునికి నల్లపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అమ్మవారికి ఓడిబియ్యం, సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి ఏర్పాట్లు చేశారు.

క్రీడలతోపాటు వ్యక్తిత్వ వికాసం అవసరం

జహీరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : యువతకు క్రీడలతోపాటు వ్యక్తిత్వ వికాసం అత్యవసరమని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో జరుగుతున్న ఖిజార్‌యాపై గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్‌కు ఆయన హాజరయ్యారు. ఇందులో విజేతకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఖిజార్‌యాపై, అబ్దుల్ యాపై, నాయకులు పాల్గొన్నారు.



మెదక్‌లోని వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణ తంతును నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా గోదాదేవి కల్యాణం

మెదక్ అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ప్రత్యేక పూజల్లో భాగంగా నిర్వహించే గోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం ఆదివారం జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కంచి మధుసూదన్ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవం సందర్భంగా భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం సర్పంచ్ సుజాతకాంతారావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నరేంద్రచార్యులు, జితేందర్ చార్యులు, రంగాచార్యులు, వైద్య శ్రీనివాస్‌శర్మ, కృష్ణారావుశర్మ, శ్రీనివాస్‌చారి, నారాయణచార్యులు, కౌన్సిలర్ రామగిరి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు నాజరాజు పాల్గొన్నారు.

పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో 'కనువిప్పు'

జగదేవ్‌పూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామంలో శనివారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. నరసయ్య కానిస్టేబుల్, పోలీస్ కళాబృందం సభ్యులు, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు కార్యక్రమంలో గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.